నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, సోమవారం 26 మే 2025 | MAHABUBNAGAR NARAYANPET

అక్రమ కేసులు ఎత్తివేయాలి

- కక్షసాధింపులేనా ప్రజాపాలనంటే?
- బీఆర్ఎస్ నాయకులను వేధిస్తే సహించేది లేదు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- వనపర్తిలో భారీ బైక్ ర్యాలీ

వనపర్తి టౌన్/పెద్దమందడి, మే 25 : వనపర్తి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని కోరుతూ బీఆర్ఎస్ శ్రేణులు కదం తొక్కారు. ఆదివారం సోషల్ మీడియా వేదికగా అసత్యపు ప్రచారాలు, వ్యక్తిగత దూషణలను కట్టడి చేయాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన స్వగృహం నుంచి రాజీవ్‌చౌక్, కొత్త బస్టాండ్ మీదుగా ఎస్పీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్పీతో బీఆర్ఎస్ శ్రేణులు మాట్లాడుతూ శనివారం రాత్రి పెద్దమందడి మండలం దొడగుంటపల్లికి చెందిన సురేశ్, జంగమాయిపల్లికి చెందిన కొండల్‌ను ఎస్సై శివకుమార్ అక్రమంగా స్టేషన్‌లోనే నిర్బంధించారని, దీనిని నిరసిస్తూ పెద్దమందడిలో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారని వెల్లడించారు. మండలంలో సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులపై వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని, దీనికి సమాధానంగా బీఆర్ఎస్ నాయకులు స్పందిస్తే పోలీసులు అధికార పక్షానికి వత్తాసు పలుకుతూ బీఆర్ఎస్ శ్రేణులపై అక్రమ కేసులు,అరెస్టుల పర్వం, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో వ్యక్తిగత పోస్టులు పెట్టినా సహనంతో ఉంటున్నామని, ఇలా కార్యకర్తలను వేధిస్తే పార్టీ పరంగా కార్యాచరణ ప్రకటించాల్సి వస్తుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ అన్నారు. కొందరు పోలీసు అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ కార్యకర్తలను వేధిస్తున్నారన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్నా ఏనాడు ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపులకు పాల్పడ లేదని, అధికారంలోకి వచ్చి 18నెలలు గడవక ముందే అక్రమ కేసులు పెట్టి మా పార్టీ కార్యకర్తలను వేధిస్తున్నారన్నారు. వ్యక్తిగత విమర్శలు చేస్తూ కలుషిత వాతావరణాన్ని సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలని, వాట్సాప్‌లో వ్యక్తిగత దూషణలకు పాల్పడిన ఏ పార్టీ వారైనా ఉపేక్షించవద్దని, క్షేత్ర స్థాయి పోలీస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, రమేశ్‌గౌడ్, నందిమల్ల అశోక్, విజయ్‌కుమార్, పరంజ్యోతి, మాణిక్యం, రఘుపతిరెడ్డి, వేణుయాదవ్, బండారు కృష్ణ, నాగన్నయాదవ్, తిరుమల్, రహీం, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, మాధవరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జోహెబ్‌హుస్సేన్, గిరి, సునీల్, చిట్యాల రాము, సురేశ్, ముద్దు, అలీం, వెంకట్, నాగరాజు, వెంకటేశ్‌సాగర్ తదితరులు ఉన్నారు.

పెద్దమందడిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా..

సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ప్రశ్నించినందుకు శనివారం అర్ధరాత్రి బీఆర్ఎస్ కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం పెద్దమందడి పోలీస్ స్టేషన్ వద్ద బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మండలంలోని దొడగుంటపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సురేశ్‌కుమార్, కొండన్న సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ప్రశ్నించడంతో అర్ధరాత్రి పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తే తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అర్ధరాత్రి అరెస్ట్ చేసి ప్రశ్నించడం ఏంటని అన్నారు. పోలీసులు ప్రజల కోసం పని చేస్తున్నారా లేక కాంగ్రెస్ పార్టీ నాయకుల కోసం పనిచేస్తున్నారా అని అన్నారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్ నాయకులు పోస్టులు పెడితే తప్పు లేదు కానీ బీఆర్ఎస్ నాయకులు పోస్టులు పెడితే తప్పుగా అనిపిస్తుందా అని వాపోయారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ నాయకులే రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఎన్నో సార్లు పోస్టులు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ప్రశ్నిస్తే కేసులు, అరెస్టులు చేస్తున్నారన్నారు. ఇలాంటి అక్రమ అరెస్టులకు భయపడేది లేదని వారన్నారు. కార్యక్రమంలో సేనాపతి, సింగిరెడ్డి కురుమూర్తి, పురుషోత్తం రెడ్డి, రాజు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్పీతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోతలు.. వెతలు

- కాంగ్రెస్ పాలనలో మరమ్మతుల పేరిట విద్యుత్ సరఫరా నిలిపివేత
- నెలలో 10రోజులకు పైగా అప్రకటిత కోతలు
- ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులు
- విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై వినియోగదారుల మండిపాటు

గద్వాల, మే 25 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హయాంలో ఉన్న కరెంట్ కష్టాలు ప్రజలు, రైతులకు ఇన్నాళ్లకు మళ్లీ మొదలయ్యాయి. జిల్లాలో మరమ్మతుల పేరిట విద్యుత్ శాఖ అధికారులు కోతలు విధిస్తుండడంతో ఇటు ప్రజలతో పాటు రైతులు విద్యుత్ శాఖ అధికారుల తీరుపై మండి పడుతున్నారు. జిల్లాలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో మరమ్మతుల పేరిట నెలలో 10 రోజులకు పైగా గంట నుంచి మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారు. దీంతో ప్రజలతో పాటు చిరువ్యాపారులు, గృహిణులు విద్యుత్ శాఖ అధికారుల తీరుపై మండి పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే కరెంట్ కోతలు తప్పవని, కరెంట్ వైర్లపై బట్టలు ఆరేసుకునే పరిస్థితి వస్తుందని గతంలో కాంగ్రెస్ సీఎం అన్న మాటలు ప్రస్తుతం వారి పాలనలో అదే జరుగుతున్నట్లు అని పిస్తుంది. 2014 రాష్ట్ర ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ విద్యుత్ సమస్యపై దృష్టి సారించారు. విద్యుత్ శాఖలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి రైతులు, ప్రజలు, చిరువ్యాపారులు, పరిశ్రమలకు ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తకుండా నిరంతర విద్యుత్ అందించారు. గత కాంగ్రెస్ సీఎం అన్న మాటలు తిప్పి కొడుతూ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రెప్పపాటు కూడా విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకొని సీమాంధ్ర పాలకులు చేసిన ఆరోపణలకు నిరంతర విద్యుత్ అందించి తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ ధీటైన సమాధానం ఇచ్చాడు. గత పదేండ్ల కాలంలో అన్ని వర్గాల ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించి, కోతలు లేని రాష్ట్రంగా తెలంగాణ విద్యుత్ వ్యవస్థను తీర్చిదిద్దాడు.

ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఓ వైపు మరమ్మతుల పేర మూడు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పాటు ,అనధికారంగా రోజులో మరో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

మరమ్మతుల పేర మూడు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిపివేత

నెలలో 10రోజులకు పైగా జిల్లాలో మరమ్మతుల పేర రెండు నుంచి నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా విద్యుత్ శాఖ అధికారులు నిలిపివేస్తున్నారు. ఉదయం 7నుంచి 9గంటల వరకు, మరో సారి 11గంటల వరకు, సాయంత్రం 3నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ముఖ్యంగా ఉద్యోగస్తులు, గృహిణులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఏప్రిల్‌లో 10రోజుల పాటు ఉదయం 7 నుంచి 10గంటల వరకు,11 నుంచి 12గంటల వరకు, 3 నుంచి 5 గంటల వరకు మరమ్మతుల పేరిట విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మే నెలలో ఇప్పటి వరకు ఆరురోజుల పాటు ఉదయం 7 నుంచి 8గంటల వరకు 10నుంచి11 గంటలవరకు మరమ్మతుల పేరుతో అప్రకటిత కోతలు విద్యుత్ శాఖ అధికారులు విధిస్తున్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక సారి అలా రోజులో రెండు ప్రాంతాల్లో రెండు సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నది. విద్యుత్ కోతలు భరించలేక ప్రజలు ఇన్వర్టర్లు కొనుగోలు చేసి ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు విధిస్తున్న అప్రకటిత కోతల కారణంగా చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా జిరాక్స్‌సెంటర్ నిర్వాహకులు, మోటర్ వైండింగ్ వారు, పిండిగిర్నీలు, హోటళ్ల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17 నెలల కాలంలో మళ్లీ ప్రజలకు, చిరువ్యాపారులకు కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఎక్కువ కోతలు లేకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మరమ్మతులు చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఉమ్మడి రాష్ట్రంలో ప్రజలు ఆది నుంచి కరెంట్ కష్టాలు ఎదుర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత నాటి సీఎం కేసీఆర్ కరెంట్ కష్టాలు దూరం చేయడంతో పదేండ్లు ఎలాంటి కోతలు లేకుండా నిరంతరం విద్యుత్‌ను అందించడంతో రైతులు, ప్రజలు సంతోషంగా ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కరెంట్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. రైతులు విద్యుత్ కోతలతో తమ పంటలను ఎండబెట్టుకొని పూర్తిగా వదిలేసుకున్న పరిస్థితులు ఎన్నో చూశాం. మరమ్మతుల పేరుతో రోజుకు గంట నుంచి మూడు గంటలపాటు కోతలు విధిస్తుండడంతో ప్రజలు, చిరువ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నేడు గులాబీ గూటికి మాజీ ప్రజాప్రతినిధులు

- హైదరాబాద్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో చేరికలు
- బాసు హన్మంతు నాయుడు ఆధ్వర్యంలో 100 వాహనాల్లో..

గద్వాల, మే 25 : నడిగడ్డలో గులాబీ జెండాకు పూర్వవైభవం సంతరించుకోనున్నది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో పార్టీ వదిలి వెళ్లిన వారికి తగిన బుద్ధి చెప్పాలనే ఆలోచన నడిగడ్డ ప్రజలు, ప్రజాప్రతినిధుల్లో మొదలైంది. పార్టీలోకి వచ్చి పోయే నాయకులు ముఖ్యం కాదని నాయకులు వస్తుంటారు.. పోతుంటారు కాని పార్టీ ముఖ్య మనే భావన నడిగడ్డ ప్రజల్లో నెలకొన్నది. గద్వాల నియోజకవర్గంలో మేము లేకుంటే పార్టీ లేదు.. మేము ఉంటేనే పార్టీకి బలం బలగం అనే చెప్పుకునే వారికి చెంప పెట్టులా వారికి దిమ్మతిరిగేలా షాక్ ఇవ్వడానికి గద్వాల నియోజకవర్గ ప్రజలతోపాటు మాజీ ప్రజాప్రతినిధులు రేడీ అయ్యారు. పార్టీలోకి ఎవరు వచ్చినా వెళ్లిపోయినా పార్టీకి బలం కార్యకర్తలే అనే చెప్పే విధంగా చేరికలు ఉండేలా ఇక్కడి బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు బాసు హన్మంతు ఉన్నారు. ఇక్కడి ఇద్దరు ప్రజాప్రతినిధులు పార్టీ పదవులు అనుభవించి పార్టీకి ద్రోహం చేసి వెళ్లినా పార్టీకి కొంత మంది నిఖార్సైన కార్యకర్తలు బీఆర్ఎస్‌కు అండగా ఉండడంతో ప్రస్తుతం గద్వాల నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో గులాబీ దండు పెరిపోతూ వస్తుంది. ఇది చూస్తున్న బీఆర్ఎస్‌ను వదిలి వెళ్లిన కొంత మంది ప్రజాప్రతినిధులు నిద్ర పట్టడం లేదు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో పదవులు పొందిన వారు ఇప్పుడు వారు ఏ పార్టీలో ఉన్నారో తేల్చుకోలేక పోతూ ప్రజల ముందు నవ్వుల పాలు అవుతున్నారు. పదవులు పొందిన వారు పార్టీని వదిలి వెళ్తే, కష్ట కాలంలో పార్టీకి అండగా నిలిచాడు బలిగేర మాజీ సర్పంచ్ బాసు హన్మంతు నాయుడుతో పాటు ఆయన సతీమణి గట్టు మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల. ఇద్దరు గద్వాల నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు అండగా ఉంటూ పార్టీ ఏ కార్యక్రమం ఆదేశించినా తూచా తప్పకుండా పాటిస్తూ గద్వాల నియోజకవర్గ గులాబీ కార్యకర్తలకు అండగా ఉంటున్నారు. ఆయన చొరవతో ఇక్కడి నేతలకు దిమ్మతిరిగే షాక్ నేడు ఇవ్వనున్నారు.

నేడు కేటీఆర్ సమక్షంలో చేరికలు

నేడు హైదరాబాద్ లోని బీఆర్ఎస్ భవన్‌లో గద్వాల నియోజకవర్గ నాయకుడు బాసు హన్మంతు నాయుడు ఆధ్వర్యంలో గద్వాల నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన 45మంది మాజీ ప్రజాప్రతినిధులు (సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్యనాయకులు, మండల పార్టీ అధ్యక్షులు) కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నారు. ధరూర్, కేటీదొడ్డి, గద్వాల, మల్దకల్ మండలాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌లో చేరుతుండడంతో ప్రతిపక్ష పార్టీల నాయకుల గుండెల్లో గుబులు పుట్టుకున్నది. ఇక్కడి రెండు జాతీయపార్టీలోని నాయకులు వెంట ఉంటే మా పరిస్థితి ఆగమ్యగోచరంగా మారే అవకాశం ఉందనే భావనతో వారు పార్టీ మారడానికి సిద్ధమైనట్లు తెలిసింది. గతంలో ధరూర్, కేటీదొడ్డి మండలాల్లో పార్టీ నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారితో పాటు గద్వాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ నాయకులు, గద్వాల మండలానికి చెందిన ఓ మాజీ సర్పంచ్‌తో పాటు మల్దకల్ మండలానికి చెందిన నేతలు పార్టీలో చేరుతున్నట్లు తెలిసింది. సోమవారం 100 వాహనాల్లో గద్వాల నుంచి బయలుదేరి హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరనున్నారు. దీంతో నియోజకవర్గంలో గులాబీ జెండాకు బలం పెరగనున్నది. ఇది గద్వాల నియోజకవర్గంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఉపయోగపడే అవకాశంతో పాటు, రెండు జాతీయ పార్టీలకు గట్టిగా ఢీకొనే నాయకులు బీఆర్ఎస్‌లో సిద్ధంగా ఉన్నారనే సంకేతాలు బీఆర్ఎస్ నేతలు ఇస్తున్నారు.

కండక్టర్ల నిర్లక్ష్యం

మిషన్లు మార్పిడి కావడంతో డిపోకు వెను దిరిగిన మహబూబ్‌నగర్ వెళ్లే బస్సు

అచ్చంపేట రూరల్, మే 25 : కండక్టర్లు తాము నిర్వర్తించే విధుల్లో బాధ్యతరహితంగా వ్యవహరించి ప్రయాణికులను ఇబ్బందుల పాలు చేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో చోటు చేసుకున్నది. ప్రయాణికులు కథనం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు టీఎస్ 06 UD 0854 నెంబర్ గల బస్సు అచ్చం పేట డిపో నుంచి మహబూబ్‌నగర్ వెళ్లేందుకు అచ్చంపేట బస్టాండ్‌లో కేటాయించిన పాయింట్ వద్దకు వచ్చింది. కాగా విధులు నిర్వర్తిస్తున్న మహిళా కండక్టర్ ప్రయాణికులు ఎక్కడానికి పట్టే సమయంలో డిపోలోనే టీ తాగుతూ మహిళ కండక్టర్లు ముచ్చట్లు పెడుతూ తమ చేతిలో ఉన్నా టికెట్ల మిషన్‌ను మరిచి ఒకరి మిషన్ మరొకరు తీసుకెళ్లారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ ప్రయాణికులకు టికెట్లను ఇచ్చే సమయంలో ఎంతకు వారు అడిగిన స్టేజిలకు టికెట్లు ఇష్యూ కాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కిలోమీటర్ దూరం ప్రయాణించి అనంతరం చేసేది లేక డిపోకు బస్సును తీసుకొచ్చి ఆర్టీసీ ఉన్న తాధికారులకు విషయాన్ని తెలిపి బస్సు మహబూబ్‌నగర్ వెళ్లడం లేదని చావుకబురు చల్లగా చెప్పి ప్రయాణికుల ఆగ్రహానికి గురికావల్సి వచ్చింది. విధులపై నిర్లక్ష్యం వహించిన కండక్టర్‌పై డిపో మేనేజర్ చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేశారు.

కోడేరు మండలం పస్పుల కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

కాంటా వేయరు..లారీలు రావు

- వర్షానికి తడుస్తున్న ధాన్యం
- ఆందోళనలో అన్నదాతలు

కోడేరు, మే 25 : మండలంలోని వివిధ గ్రామాల్లో ఐకేపీ, పీఏసీసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి 20రోజులు కావస్తున్నా లారీలు రావడం లేదనే సాకుతో కాంటాలు వేయడం లేదని రైతులు వాపోతున్నారు. ధాన్యం అకాల వర్షాలకు తడిసి పోతున్నదని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ యాసంగి సీజన్‌లో ప్రభుత్వం మండలంలో 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే ఏఒక్క కేంద్రంలో కూడా కొనుగోళ్లు సక్రమంగా జరుగక రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. మండలంలోని కోడేరు, జనుంపల్లి, తీగలపల్లి, పసుపుల, బావాయిపల్లి, కొండ్రాపుల్లి, ఎత్తం, నర్సాయపల్లి, మైలారం, నాగులపల్లి, రాజాపుల్ తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నీ బ్యాగులు లేవని లోడింగ్ కోసం లారీలు రావడం లేదని నిర్వాహకులు చెబుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడురోజులుగా వర్షాలు కురుస్తున్నా ధాన్యం కొనుగోళ్లలో వేగవంతం చేయడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని కొనుగోళ్లను వేగవతం చేయలని రైతులు కోరుతున్నారు.

అన్నదాతల అగచాట్లు

- వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యం
- లారీల కొరతతో కొనుగోలు కేంద్రంలో రైతుల పడిగాపులు

నవాబ్‌పేట, మే 25 : మండలంలోని గురుకుంట లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో అన్నదాతలు అగచాట్లు పడుతున్నారు. ఒక పక్క లారీలు రాక వచ్చిన ధాన్యం కేంద్రంలోనే పేరుకుపోవడం..మరో పక్క వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తుతుండటంతో రైతులు బావురుమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గురుకుంట రైతు వేదికలో ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాగా కొన్ని రోజులుగా గురుకుంటతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు పెద్దఎత్తున ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తున్నారు. రైతులు తీసుకొస్తున్న ధాన్యానికి సరిపడా లారీలు రాకపోవడంతో తెచ్చిన ధాన్యం..కొనుగోలు కేంద్రం నుంచి లిఫ్ట్ కావడం లేదు. వారం రోజులైనా కొంతమంది రైతుల ధాన్యం అక్కడే పడి ఉంది. అక్కడికి వెళ్లి చూస్తే.. ధాన్యం రాశులు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఇక్కడికి లారీలు రావడం లేదని రైతులు పేర్కొన్నారు. ఈ విషయంపై..ఏపీఎం జీవరత్నంను వివరణ కోరగా...గురుకుంటకు రెండు లారీలు అవసరం కాగా..ఒకటే లారీ ఉన్నందున ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఉన్న ఒక్క లారీలో కూడా రైస్ మిల్లుకు ధాన్యం తీసుకెళ్తే..అక్కడ ధాన్యం దించేందుకు ఆలస్యమవుతుందని వివరించారు. ఇబ్బందులు లేకుండా సోమవారం నుంచి అదనంగా ఇంకో లారీ ఏర్పాటు చేస్తామని వివరించారు.

గురుకుంట కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

చేనుకు చేవ.. రైతుకు లాభం

- చెరువులు, కుంటల్లో పూడిక మట్టితో పంటకు పోషణ
- సారవంతంగా పొలాలు
- తగ్గనున్న రసాయన ఎరువుల వాడకం
- ఇదే అనువైన సమయం అంటున్న అధికారులు

కుంటలో నుంచి పూడిక మట్టిని తీసుకెళ్తున్న రైతులు

కోడేరు, మే 25 : చెరువులు, కుంటల్లో పూడిక మట్టిని పొలాల్లో వేసుకుంటే పంటకు పోషణ లభించి అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ మట్టితో పొలాలు సారవంతంగా మారుతాయని, సాగుకు రసాయన ఎరువులు వాడకం తగ్గి పెట్టుబడి ఖర్చులు మిగులుతాయని అధికారులు వివరిస్తున్నారు.

కానీ చాలా వరకు ఈమట్టితో ఇటుక బట్టీలు పెడుతూ కొందరు వ్యాపారులు రూ.లక్షలు గడిస్తున్నారు. పంట భూములను సైతం ఇటుక బట్టీలుగా మార్చి వ్యాపారం చేస్తున్నారు. ఈమట్టితో వ్యవసాయ సాగు భూములల్లో వేసుకుంటే మరింత సారవంతగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు పశుసంపద తగ్గిపోవడంతో సేంద్రియ ఎరువులు లేక పంటల సాగుకు 90శాతానికి పైగా రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులు, గడ్డిమందులు, విచ్చలవిడిగా వాడుతున్నారు. దీంతో పర్యావరణానికి జీవ కోటికి హానికలుగుతున్నది. ఫలితంగా పంట భూములు నిస్సారంగా మారుతున్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వర్షాలకు సారవంతమైన పోషకాలు కొట్టుకొచ్చి చెరువులు, కుంటల్లో నిక్షిప్తమవుతాయి. చెరువుల్లో పేరుకు పోయిన మట్టిని తిరిగి పొలాల్లో వేయటం వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయని పూడిక మట్టిని చేలల్లో వేసుకోవడానికి ఇదే అనువైన సమయమని అధికారులు పేర్కొంటున్నారు.

పూడికమట్టితో ప్రయోజనం

నేల గుణాన్ని బట్టి ఎకరాకు 15 నుంచి 40 ట్రాక్టర్ల పూడిక మట్టిని వేసుకోవచ్చు. పూడికమట్టితో తేమను పట్టి ఉంటే గుణం ఎక్కువగా ఉంటుంది. పంటకు పోషకాలు అందుతాయి. ఇసుక, గరుసు తదితర తక్కువ సారమున్న నేలలకు పూడిక మట్టితో ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ప్రధానంగా సేంద్రియ కర్బనం ఉండే ఎర్ర నేలలు తేలికపాటి నేలలకు ఉపయుక్తంగా ఉంటుంది. -మధుసూదన్‌రెడ్డి, ఏఈవో, కోడేరు.

అందరూ ఉన్నా..అనాథే

- తల్లి కడచూపునకు రాని కుమారులు
- అంత్యక్రియలు చేసిన కాలనీవాసులు

జడ్చర్ల టౌన్, మే 25 : కొడుకులు, బంధువులు ఉన్నా..అనాథగా మిగిలిందామె...తల్లి చనిపోయిందని తెలిసినా కడచూపు చూసేందుకు కొడుకులు ముందుకురాలేదు. చివరికి కాలనీవాసులే ముందు కొచ్చి సదరు మహిళ భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించిన ఘటన జడ్చర్లలో వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. 25ఏండ్ల కిందట శాంతమ్మ(65) అనే మహిళ తన భర్తతో కలిసి జడ్చర్లకు వచ్చి లక్ష్మీనగర్‌లో నివాసముంటున్నది. ఆమెకు ఇద్దరు కొడుకులు. ఈమె భర్త ఏడేండ్ల కిందట మృతిచెందడంతో అప్పటి నుంచి శాంతమ్మ ఒంటరిగా లక్ష్మీనగర్ కాలనీలోని బంగారు మైసమ్మ ఆలయంలోనే పూజారిగా పనిచేస్తూ కాలనీవాసుల సాయంతో సమీపంలోని కమ్యూనిటీహాల్‌లో నివాసం ఉంటూ జీవనం కొనసాగించింది. శనివారం ఉదయం కమ్యూనిటీహాల్‌లోనే శాంతమ్మ మృతిచెందింది. విషయాన్ని తెలుసుకున్న కాలనీవాసులు వెంటనే ఆమె కొడుకులకు ఫోన్లు చేయగా స్పందించలేదు. బంధువులకు ఫోన్లు చేసి సమాచారం ఇచ్చినా ఎవరూ ఆమెను చూసేందుకు రాలేదు. ఆదివారం మధ్యాహ్నం వరకు ఆమె పార్థివదేహాన్ని మైసమ్మ ఆలయం వద్దనే ఉంచి ఆమె కొడుకులు, బంధువుల కోసం ఎదురు చూశారు. చివరికి పోలీసులకు సమాచారం ఇచ